


RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

ప్రచురణ :తెలంగాణ , సంపాదకులు :చెరుకు ఉపేందర్ , శనివారం - 29 - సెప్టెంబర్ - 2024 ,
సంపుటి 02, సంచిక : 25, పేజీలు -4 వెల రూ.5/-

## ఒకే ఒక్క పరిష్కారం..హెజ్‌బొల్లా అంతం

**పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గుముఖం పట్టడం లేదు.**



పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. హెజ్‌బొల్లాను అంతం చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ గగనతల దాడులు చేస్తోంది.క్షిపణులు, రాకెట్లతో విరుచుకుపడుతోంది. లెబనాన్ సరిహద్దులో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇప్పటి వరకు 600 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. సుమారు 5 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. పరిస్థితి తారస్థాయికి చేరిన నేపథ్యంలో మిగతా..2లో

## హసీనాను దించేయడం వెనక కుట్ర

**రిజర్వేషన్ల అంశం బంగ్లాదేశ్ ను నిప్పుల కుంపటిగా మార్చడంతో షేక్ హసీనా ప్రధాని పీఠం నుంచి దిగిపోయి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు.**



వాషింగ్టన్: రిజర్వేషన్ల అంశం బంగ్లాదేశ్ ను నిప్పుల కుంపటిగా మార్చడంతో షేక్ హసీనా ప్రధాని పీఠం నుంచి దిగిపోయి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు.అయితే ఆమెను దించేయడం మిగతా..2లో

## తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదలం



**తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ముంబై సినీనటి కాదంబరి జత్వానీ కేసు కీలక దశకు చేరకుంటోంది. తనను అక్రమంగా అరెస్ట్ చేశారని, రిమాండ్ పంపడంతో పాటు తనను, కుటుంబాన్ని కస్టడీలో పెట్టి చిత్రహింసలకు గురిచేశారంటూ నటి జత్వానీ ఇచ్చిన ఫిర్యాదుపై రాష్ట్ర డీజీపీ ద్వరకా తిరుమల రావు విచారణ చేపట్టారు.**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ముంబై సినీనటి కాదంబరి జత్వానీ కేసు కీలక దశకు చేరకుంటోంది. తనను అక్రమంగా అరెస్ట్ చేశారని, రిమాండ్ పంపడంతో పాటు తనను, కుటుంబాన్ని కస్టడీలో పెట్టి చిత్రహింసలకు గురిచేశారంటూ మిగతా..2లో

## కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విధ్వంసమే

**హరియాణా ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు**



**కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు.**

**అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతున్న కాంగ్రెస్ హరియాణాలో పొరపాటున అధికారంలోకి వస్తే విధ్వంసం తప్పదని అన్నారు.**

సోనిపట్: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతున్న కాంగ్రెస్ హరియాణాలో పొరపాటున అధికారంలోకి వస్తే విధ్వంసం తప్పదని అన్నారు. అభివృద్ధి పూర్తిగా ఆగిపోతుందని, మిగతా..2లో

## జగన్ క్రిస్టియన్... తిరుమలలో డిక్లరేషన్ పై సంతకం చేయాల్సిందే



**జగన్.. చెంపలు వేసుకుని మరీ.. తిరుమల లడ్డూను తిను**

**తిరుమలలో అన్యమతస్తులు రూల్స్ పాటించాల్సిందేనన్న రఘురామ**

**శ్రీవారి పట్ల విశ్వాసం ఉందని జగన్ డిక్లరేషన్ ఇవ్వాల్సిందేనని స్పష్టీకరణ**

**పాప పరిహారం కోసం జగన్ ను స్వామివారు తిరుమలకు పిలిచారని వ్యాఖ్యలు**

వైసీపీ అధినేత జగన్ ఈ నెల 28న తిరుమల శ్రీవారి దర్శనానికి వెళుతున్న సంగతి తెలిసిందే. 27న ఆయన అలిపిరి నడక దారిలో తిరుమలకు చేరుకుని... 28న శ్రీవారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో జగన్ ను ఉద్దేశించి టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్ క్రిస్టియన్ అనే విషయం అందరికీ తెలిసిందేనని మిగతా..2లో

## తప్పు చేశారు కాబట్టే డిప్యూటీ సీఎం పవన్ ప్రాయశ్చిత్త దీక్ష



**తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారంపై మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు స్పందించారు. తిరుమల లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యికి సంబంధించి.. జూన్ 12 నుంచి ఏఆర్ డెయిరీ సప్లై మొదలైందని..అప్పటికే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు.**

తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారంపై మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు స్పందించారు.గురువారం మధ్యాహ్న ఓ ప్రముఖ మీడియా ఛానల్ తో ఆయన మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. మిగతా..2లో

## సిరిసిల్ల నేతలన్న తరపున పోరాటానికి సిద్ధం

ఐలమ్మ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో పెట్టింది

హైడ్రా బాధితులకు అండగా ఉంటాం... అక్కడకు రండి

హైడ్రా బాధితులకు బీఆర్ఎస్, పార్టీ న్యాయవిభాగం అండగా ఉంటుందన్న కేటీఆర్

బాధితులు బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ కార్యాలయానికి రావాలని సూచన

లేదంటే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను కలవాలన్న కేటీఆర్



తెలంగాణ ఆడబిడ్డలకు, మహిళలకు ఆదర్శప్రాయమైన నాయకురాలు వీరనారి చాకలి ఐలమ్మ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కొనియాడారు .చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని గురువారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు, జిల్లా రజక సంఘ సభ్యులతో కలిసి జిల్లా కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో నియంతృత్వాన్ని ఎదిరించి తెలంగాణకు స్ఫూర్తినిచ్చిన అద్భుతమైన వీర వనిత ఐలమ్మ అన్నారు. అలాంటి వీరవనితతో పాటు మహనీయుల జయంతి, వర్ధంతులను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా జరపడం మొదలు పెట్టిందని గుర్తు చేశారు.చిట్యాల ఐలమ్మ జీవిత చరిత్రను మిగతా..2లో

## ఆ ధర్మాన్నే పవన్ కళ్యాణ్ పాటిస్తాడు



**తిరుమల లడ్డూ వ్యవహారం దేశ వ్యాప్తంగా దుమారం రేపుతోంది.**

**ఈ అంశంపై సినీ, రాజకీయ ప్రముఖులు స్పందిస్తూ వారి వారి అభిప్రాయాలను చెబుతున్నారు.**

**ఈ క్రమంలోనే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు.**

తిరుమల లడ్డూ వ్యవహారం దేశ వ్యాప్తంగా దుమారం రేపుతోంది. ఈ అంశంపై సినీ, రాజకీయ ప్రముఖులు స్పందిస్తూ వారి వారి అభిప్రాయాలను చెబుతున్నారు.ఈ క్రమంలోనే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. ఈ దీక్షపై జనసేన నేత, కొణిదెల నాగబాబు మరో ట్వీట్ పెట్టారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్‌గా మారింది. 'నీ మతంతో పాటు సాటి మతాలని గౌరవించు, మిగతా..2లో

## పీఎం కిసాన్ 18వ విడత తేదీ ఖరారు




**రైతులకు ఆర్థిక సహాయం అందించే కేంద్ర ప్రభుత్వ పథకం పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని తీసుకువచ్చిన విషయం తెలిసిందే.**

**ఈ పథకం ద్వారా రైతులు ప్రతి ఏడాది రూ.6000 అందుకుంటున్నారు.**

రైతులకు ఆర్థిక సహాయం అందించే కేంద్ర ప్రభుత్వ పథకం పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఈ పథకం ద్వారా రైతులు ప్రతి ఏడాది రూ.6000 అందుకుంటున్నారు.ఈ మొత్తం ఒకేసారి కాకుండా మూడు విడతల్లో రూ.2000 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది కేంద్రం. అయితే ఇప్పటి వరకు రైతులు 17వ విడత డబ్బులు అందుకున్నారు. ఇప్పుడు 18వ విడత రావాల్సి ఉంది. ఈ విడత కూడా వచ్చేందుకు సమయం ఆసన్నమైంది. నవరాత్రి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు గుడ్‌న్యూస్ చెప్పింది. మిగతా..2లో

## డిక్లరేషన్ సాంప్రదాయాన్ని జగన్ పాటిస్తే బాగుంటుంది!

**దేవుడి జోలికెళితే ఏమవుతుందో జగన్ ఎన్నికల్లో చూశారన్న లోకేశ్**

**మనం ఏ మతానికి చెందినా, అన్ని మతాలను గౌరవించాలని హితవు**

**రెడ్ బుక్ పని ప్రారంభమైంది... తప్పుచేసిన వారిని వదలబోమని వార్నింగ్**

**విశాఖలో మంత్రి నారా లోకేష్ "ప్రజాదర్బార్"**



శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారం నేపథ్యంలో, మాజీ సీఎం జగన్ ఈ నెల 28న తిరుమల వెళ్లి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలని నిర్ణయించుకోవడం తెలిసిందే. అయితే, జగన్ తన తిరుమల పర్యటన సందర్భంగా ఆలయంలో డిక్లరేషన్ ఇస్తే బాగుంటుందని ఏపీ మంత్రి నారా లోకేశ్ సూచించారు. మనం ఏమతానికి చెందిన వారమైనా అన్నిమతాలను గౌరవించాలని హితవు పలికారు. తాము చర్చి, మసీదులకు వెళ్లినపుడు వారి మత విశ్వాసాలకు అనుగుణంగా నడుచుకుంటామని స్పష్టం చేశారు. జగన్ దేవుడి జోలికి వెళితే ఏమైందో గత ఎన్నికల్లో మీరంతా చూశారు అని లోకేశ్ వ్యాఖ్యానించారు. శ్రీకాకుళంలో ఓ పాఠశాల పరిశీలన అనంతరం లోకేశ్ మీడియాతో మాట్లాడారు. "తిరుమల వెళతానంటున్న జగన్ డిక్లరేషన్ ఇచ్చే సాంప్రదాయాన్ని పాటిస్తే బాగుంటుంది. తిరుమల లడ్డూ నాణ్యతా లోపంతో పాటు అనేక సమస్యలను భక్తులు యువగళం పాదయాత్రలో నా దృష్టికి తెచ్చారు. అధికారంలోకి వచ్చాక టీటీడీని ప్రక్షాళన చేయాలని ఈవోకు చెప్పాం. నెయ్యి సరఫరా చేసే కంపెనీ టర్నోవర్ రూ.250 కోట్లు ఉండాలన్న నిబంధనను వైవి సుబ్బారెడ్డి రూ.150 కోట్లకు తగ్గిస్తూ ఎందుకు సవరించారు? తిరుమలలో జరిగిన అవకతవకలపై నిగ్గు తేల్చేందుకు కమిటీ వేశాం. ఆ కమిటీ విచారణలో వాస్తవాలు బయటకు వస్తాయి. ఇప్పుడు తిరుమల లడ్డూ క్వాలిటీ బాగుందని వైసీపీ ప్రజాప్రతినిధులు కూడా చెబుతున్నారు.

### జగన్ మాదిరి మేం పారిపోయే వ్యక్తులం కాదు!

జగన్ లా మేం పారిపోయే వ్యక్తులం, కాదు. ఇప్పటికే పెన్షన్లు, మెగా డిఎస్సీ హామీలను అమలు చేశాం. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇస్తామని ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించారు. పథకాల అమలుపై మాకు చిత్తశుద్ధి ఉంది. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాం. జగన్ లా పరదాలు కట్టుకుని మేం తిరగడంలేదు. తప్పు చేయకపోతే వారు ఎందుకు భయపడ్డారు? ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలమధ్య ప్రజావేదిక నిర్వహిస్తున్నారు. మిగతా..2లో

## ఆ విషయం నేను ముందే చెప్పా

**కేసీఆర్‌ను దెబ్బ కొడితే దిమ్మతిరిగింది**

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య పొలిటికల్ కెరీర్ పై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.**

**ఒక పార్టీకి చెందిన వ్యక్తిగా మీపై ముద్ర పడవద్దని, బీసీ వర్గాల నాయకుడిగా మాత్రమే రాణించగలవని నేను గతంలోనే ఆర్.కష్ణయ్యకు చెప్పానని ఈటల అన్నారు.**



బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య పొలిటికల్ కెరీర్ పై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఒక పార్టీకి చెందిన వ్యక్తిగా మీపై ముద్ర పడవద్దని, బీసీ వర్గాల నాయకుడిగా మాత్రమే రాణించగలవని నేను గతంలోనే ఆర్.కష్ణయ్యకు చెప్పానని ఈటల అన్నారు. ఇది నాది అని చెప్పుకునే తృప్తి రాజకీయ పార్టీలలో ఉండదని అది కేవలం సంఘాలలో మాత్రమే ఉంటుంన్నారు. రాజకీయ పార్టీలలో కృష్ణయ్య ఇమడలేకపోతున్నారని అన్నారు. అయితే ఎంపీ పదవికి రాజీనామా చేసిన ఆర్.కృష్ణయ్య త్వరలో బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేస్తానన్నారు. ఆదిశగా పార్టీ పెట్టాలని తనపై ఒత్తిడి ఉందని కూడా చెప్పారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలో ఉంటే రాణించలేవంటూ ఈటల చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారాయి. గురువారం నారాయణగూడలో బీసీ కుల సంఘాల ఐక్యత రౌండ్ టేబుల్ సమావేశంలో మిగతా..2లో

# హసీనాను దించేయడం వెనక కుట్ర

ప్లాన్ ప్రకారం జరిగిన కుట్రే అని ఆ దేశ తాత్కాలిక సారథి, నోబెల్ గ్రహీత మహ్మద్ యూనస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆయన ఈ విధంగా స్పందించారు. క్లింటన్ గ్లోబల్ ఇనిషియేటివ్ వార్షిక సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఆ సమయంలో అక్కడ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఉన్నారు.యూనస్ మాట్లాడుతూ.. విద్యార్థి నాయకులు బంగ్లాదేశ్‌కు కొత్త రూపు తీసుకువచ్చారని కొనియాడారు. హసీనాను పదవి నుంచి దింపే కుట్రవెనక ఎవరున్నారో బయటకు రాలేదు కానీ.. మహఫుజ్ అబ్దుల్లా పాత్ర ఉండొచ్చంటూ పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఇదంతా యాదృచ్ఛికంగా జరిగింది కాదని, ఒక ప్రణాళిక ప్రకారం జరిగిందని అన్నారు. ఇదిలా ఉంటే.. హసీనాను దించే కుట్రలో విదేశీ హస్తం ఉందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అందులో అమెరికా పేరు కూడా వినిపించింది. పదవి నుంచి దిగిపోవడానికి ముందు మేలో హసీనా చేసిన ప్రకటన కూడా అందుకు కారణమైంది.బంగ్లాదేశ్‌కు చెందిన సెయింట్ మార్టిన్ దీవిలో వైమానిక స్థావరం ఏర్పాటుచేసుకోవడానికి ఒక దేశానికి అనుమతిస్తే.. తన ఎన్నిక సాఫీగా జరిగేటట్లు చేస్తానని ఆఫరిచ్చిందన్నది దాని సారాంశం. ఆ ప్రకటన ఒక్కసారిగా ప్రపంచం దృష్టిని ఆకర్షించింది.

# పీఎం కిసాన్ 18వ విడత తేదీ ఖరారు

ఈ 18వ విడతను విడుదల చేసే తేదీని ప్రభుత్వం ప్రకటించింది. దాదాపు 9 కోట్ల మంది పేద రైతులకు పిఎం కిసాన్ యోజన కింద రూ.2,000 అందజేయనున్నారు.పీఎం కిసాన్ యోజన వెబ్‌సైట్ ప్రకారం, దాని 18వ విడతను 5 అక్టోబర్ 2024న ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేస్తారు. ఈ పథకానికి పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తుంది.పథకం ప్రయోజనాలను పొందడానికి తప్పనిసరి:మీరు మీ ఖాతాలో పీఎం కిసాన్ యోజన డబ్బును స్వీకరించాలనుకుంటే, మీరు పీఎం కిసాన్ పోర్టల్‌లో చేయడం తప్పనిసరి. పీఎం కిసాన్ యొక్క లేని వారు పథకం ప్రయోజనాలను పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. కిసాన్ పోర్టల్‌లో, మీరు మొబైల్ నంబర్, ఆధార్ కార్డ్ సహాయంతో ఓటీపీ సహాయంతో మీ ని పూర్తి చేయవచ్చు. మీరు దీన్ని చేయలేకపోతే, మీ సమీప కామన్ సర్వీస్ సెంటర్ ని సందర్శించడం ద్వారా మీరు పనిని పూర్తి చేయవచ్చు.ఇంతకుముందు, ప్రభుత్వం జూలైలో పిఎం-కిసాన్ యోజన యొక్క 17వ విడతను విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం 2019లో ఈ పథకాన్ని ప్రారంభించింది. అయితే, ఇది డిసెంబర్ 2018 నుండి అమలులోకి వచ్చింది.

# తప్పు చేశారు కాబట్టే డిప్యూటీ సీఎం పవన్ ప్రాయశ్చిత్త దీక్ష

తిరుమల లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యికి సంబంధించి.. జూన్ 12 నుంచి ఏఆర్ డెయిరీ సప్లై మొదలైందని..అప్పటికే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. అలాగేజూన్ 12 తర్వాత నెయ్యి క్వాలిటీ లేదని.. వెనక్కి పంపామని చెప్పినట్లు గుర్తు చేశారు. కూటమి నేతలు ఆరోపిస్తున్నట్లు.. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి కలిసిందనడానికి ఆధారాలు లేవని, రాష్ట్రంలో ప్రాయశ్చిత్త దీక్ష చేయాల్సింది సీఎం చంద్రబాబు నాయుడుని ప్రాయశ్చిత్త దీక్ష చేయాల్సింది చంద్రబాబు మాజీ మంత్రి అన్నారు. అలాగే లడ్డూ వ్యవహారంలో తప్పు చేశారు కాబట్టే డిప్యూటీ సీఎం పవన్ ప్రాయశ్చిత్త దీక్ష చేస్తున్నారని మాజీ మంత్రి వేణు చెప్పుకొచ్చారు.

# తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదలం

నటి జత్వానీ ఇచ్చిన ఫిర్యాదుపై రాష్ట్ర డీజీపీ ద్వరకా తిరుమల రావు విచారణ చేపట్టారు.ఈ మేరకు కేసులో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు ఐపీఎస్ అధికారులను ఆయన సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేశారు.తాజాగా, ఇదే అంశంపై హోంమంత్రి అనిత రియాక్ట్ అయ్యారు. ముంబయి నటి కాదంబరీ జత్వానీ కేసులో ఇప్పటికే ముగ్గురు ఐపీఎస్‌లను సస్పెండ్ చేసినట్లుగా గుర్తు చేశారు. తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. కేసులో మరికొంత మంది పోలీసులను కూడా విచారిస్తున్నారని తెలిపారు. విచారణలో వారు బాధ్యులని తేలితే.. అందులో ఎంత పెద్దవారు ఉన్నా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కేసును సీఎం చంద్రబాబు కూడా చాలా సీరియస్ రివ్యూ చేస్తున్నారని అనిత గుర్తు చేశారు.ముంబయి నటి కాదంబరీ జెత్వానీ కేసులో ఇప్పటికే ముగ్గురు ఐపీఎస్‌లను సస్పెండ్ చేసినట్లు హోంమంత్రి అనిత తెలిపారు.

# ఆ ధర్మాన్నే పవన్ కళ్యాణ్ పాటిస్తాడు

రక్షించు అని సమానత్వాన్ని చాటిందే సనాతన ధర్మం. ఆ ధర్మాన్నే పవన్ కళ్యాణ్ పాటిస్తాడు. ఎన్నో మీటింగ్స్ ఉధృత స్థాయిలో జరుగుతున్నపుడు మజీద్ నుంచి అజాన్ వస్తే తన స్పీచ్‌ని అజాన్ పూర్తయే దాక ఆపేసి నిశ్శబ్దం పాటిస్తాడు పవన్ కళ్యాణ్.అది పర మతానికి అతనిచ్చే గౌరవం, మర్యాద.. పవన్ కళ్యాణ్ అనే వ్యక్తిని హిందువులు మాత్రమే కాదు, క్రైస్తవులు, ముస్లింలు కూడా ప్రేమిస్తారు.. అతను మతఛాందస్స వాది కాదు హిందూ మతాన్ని గౌరవించాలి హిందూ ఆచారాలని రక్షించాలని పాటుపడేవాడు. హిందూ మత ధర్మ పరిరక్షణలో ఆయన పోరాటం క్రైస్తవుల మీద, ముస్లింల మీద కాదు హిందూ ధర్మంలో ఉంటూ హిందూ ధర్మాన్ని చులకన చేస్తూ సెక్యులర్ వాదులం అని చెప్పుకునే సూడో సెక్యులర్ వాదులను చెంపపెట్టి కొట్టడానికి మాత్రమే. తన పాలనలో ప్రతి మతం ప్రశాంతంగానే ఉంటుంది. పవన్ కళ్యాణ్ మాటలు సూడో సెక్యులర్ వాదులకి తప్ప ఏ క్రిస్టియన్‌కి ఏ ముస్లింకి బాధ కలిగించవు.. అర్థం చేస్కోగలరు' అని నాగబాబు ట్వీట్‌లో పేర్కొన్నారు.

# జగన్ క్రిస్టియన్... తిరుమలలో డిక్లరేషన్ పై సంతకం చేయాల్సిందే

రఘురాజు అన్నారు. అన్య మతస్తులు ఎవరు తిరుమలకు వెళ్లినా రూల్స్ పాటించాల్సిందేనని చెప్పారు. హిందూమతం పట్ల, స్వామివారి పట్ల విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. తిరుమల లడ్డూను వాసన చూసి వదిలేయకుండా నిండు విశ్వాసంతో లడ్డూను తినాలని చెప్పారు. తప్పు చేసిన జగన్ ను పాప పరిహారం చేసుకోవడానికి వేంకటేశ్వరస్వామి తిరుమలకు పిలిచినందుకు సంతోషంగా ఉందని రఘురాజు అన్నారు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత స్వామివారి లడ్డూని స్వచ్ఛమైన నేతితో అద్భుతంగా చేయిస్తున్నారని కొనియడారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ఎలాంటి దోషాలు జరగకుండా హిందూ మనోభావాలకు అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణం రాజు ఘాటు వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. క్రైస్తవుడు అయిన జగన్మోహన్ రెడ్డి మెట్లు ఎక్కి కాలినడకన తిరుపతి వెళుతున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి క్రైస్తవుడు అనేది అందరికీ తెలిసిందే అని.. ఎవరైనా తిరపతి వెళ్లాలంటే రూల్స్ ఫాలో అవ్వాల్సిందే అని స్పష్టం చేశారు. మతపరంగా అన్య మతస్థుడు తిరుపతి వెళ్లాలంటే హిందూ మతం పట్ల అమితమైన విశ్వాసం ఉందని ఒక డిక్లరేషన్ ఇచ్చి వెళ్ళాలన్నారు.పాపపరిహారార్థం జగన్మోహన్ రెడ్డి చెంపలు వేసుకుని తిరుపతి లడ్డూను వాసన చూసి వదిలేయకుండా నిండు విశ్వాసంతో తిరుపతి లడ్డూను తినాలని అన్నారు. పాప పరిహారార్థం తప్పు చేసిన జగన్మోహన్ రెడ్డిని స్వామివారు తిరుపతికి పిలిచినందుకు సంతోషిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని అందరితో కలిసి స్వీకరించామన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత తిరుపతి లడ్డూ స్వచ్ఛమైన నేతితో చాలా అద్భుతంగా తయారుచేశారని చెప్పారు.

# సిరిసిల్ల నేతలన్న తరఫున పోరాటానికి సిద్ధం



పాఠ్య పుస్తకాల్లో చేర్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఐలమ్మ తిరుగుబాటు అందరికీ గుర్తుండేలా జిల్లా కేంద్రంలో బ్రహ్మాండంగా ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఎంతోమందికి స్ఫూర్తినిచ్చి కదిలించిన నాయకురాలు ఐలమ్మ స్ఫూర్తితో భవిష్యత్తులో అందరూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ నేలకొండ అరుణ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు అక్కరాజు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు రజక సంఘ సభ్యులు పాల్గొన్నారు.భారాస హయాంలో నేతలన్నను కాపాడుకున్నామని, ఇప్పుడు మళ్లీ ఆత్మహత్యలు మొదలయ్యాయని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలో ఆయన మీడియాతో మాట్లాడారు.సిరిసిల్ల నేతలన్నకు రూ.3,312 కోట్ల ఆర్డర్లు ఇచ్చామని, ఉపాధి కల్పనతో నేతన్నల ఆత్మహత్యలు తగ్గాయన్నారు. "ప్రజలకు కేసీఆర్ కిట్లు,

రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక అందజేశాం. నేతన్నలతో చీరలు నేయించి పంపిణీ చేశాం. సిరిసిల్లను మరో తిరుప్పూరు చేయడానికి కృషి చేశాం.కాంగ్రెస్ హయాంలో బతుకమ్మ చీరల ఆర్డర్లు నిలిపివేశారు. బతుకమ్మ చీరల్లో కుంభకోణం జరిగిందని ఆరోపించారు. దానిపై విచారణ చేయాలని అసెంబ్లీ సాక్షిగా చెప్పాం. సిరిసిల్ల నేతన్నల తరఫున పోరాటానికి సిద్ధంగా ఉన్నాం. మా పోరాటానికి నేతన్నలు కూడా సహకరించాలి.హైడ్రా బాధితులకు తాము అండగా ఉంటామని, ఎవరికైనా ఏమైనా సమస్య వస్తే హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ ఆఫీస్... తెలంగాణ భవన్‌కు రావాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... హైడ్రా బాధితులందరికీ తప్పకుండా తమ పార్టీ, తమ పార్టీ న్యాయవిభాగం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.తమ పార్టీ కార్యాలయం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 10, రోడ్డు నెంబర్ 12 మధ్యలో ఉంటుందని, బాధితులు అక్కడికి రావొచ్చని సూచించారు. అక్కడ తమ న్యాయవిభాగం సహకారం అందిస్తుందన్నారు. తమకు ఓటు వేసి గెలిపించినందుకు హైదరాబాద్ ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.అక్కడకు రాలేని పరిస్థితుల్లో హైదరాబాద్‌లో దాదాపు అందరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ కార్పోరేటర్లే ఉన్నారని, వారి వద్దకు వెళ్లవచ్చన్నారు. న్యాయపరంగా అండగా ఉంటామన్నారు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించాలని న్యాయస్థానం ద్వారానే ప్రభుత్వానికి చెప్పిస్తామని తెలిపారు. పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చేస్తున్నారని ఆరోపించారు. సామాన్యుల పట్ల అమానవీయంగా ప్రవర్తించడం దారుణం అన్నారు. ఫుట్‌పాత్‌లపై చిన్న చిన్న దుకాణాలు నడుపుకునే వారు చాలా చిన్న చిన్న వాళ్లేనని అన్నారు. ఆక్రమణల తొలగింపు మంచిదే కానీ... ప్రత్యేకంగా వెండింగ్ జోన్‌ను ఏర్పాటు చేసి వారిని అక్కడి నుంచి పంపించాలని సూచించారు. కోటీశ్వరుల ఆక్రమణలు కూల్చివేస్తే వారికి ఎలాంటి ఇబ్బంది ఉండకపోవచ్చని... కానీ సామాన్యులు ఇబ్బంది పడతారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ శాఖ ఏం చేస్తుందో అర్థం కావడం లేదన్నారు. కొంతమంది నివాసాలు రిజిస్ట్రేషన్ అయిన మూడు రోజులకే కూల్చివేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నారా? లేక సర్కస్ నడుపుతున్నారా? అని నిలదీశారు.ఈ ప్రభుత్వానికి దమ్ముంటే పర్మిషన్ ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని సవాల్ చేశారు. అందుకే అన్యాయం జరుగుతున్న వారికి అండగా ఉండాలని తాము నిర్ణయించుకున్నామన్నారు. తాము పేదల వద్దకు వెళ్లి... బుల్డోజర్లను అడ్డుకుంటామన్నారు. తాము ఆక్రమణలను ప్రోత్సహించడం లేదని, కానీ మానవీయ కోణంలో ఆలోచించాలని సూచిస్తున్నామన్నారు. అయినా, ఆక్రమణలు అన్నీ కాంగ్రెస్ వారివే ఉంటాయని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా పేదలకు న్యాయం చేద్దామని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. ఆక్రమణలన్నింటినీ కూలగొట్టాలని ప్రభుత్వం భావిస్తే జీహెచ్ఎంసీ కార్యాలయం నాలా మీదనే ఉందని గుర్తించాలన్నారు. మంత్రులు ఇళ్లు, ఫామ్ హౌస్‌లు కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయని ఆరోపించారు.

## కుదురుపాకలో స్కూల్ భవనాన్ని ప్రారంభిస్తున్నానని కేటీఆర్ ట్వీట్

పెద్దపల్లి జిల్లాలోని కుదురుపాకలో కేటీఆర్ ఈ రోజు స్కూల్ భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. తన గ్రాండ్ పేరెంట్స్ జె.కేశవరావు, లక్ష్మీల జ్ఞాపకార్థం ఈ స్కూల్ భవంతిని నిర్మించినట్లు తెలిపారు.

# ఆ విషయం నేను ముందే చెప్పా



పాల్గొన్న ఈటల ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

### కులగణన విషయంలో..

కులగణన అనేది ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం నిర్వహించుకుంటే మంచిదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కొన్ని కులాలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో కేటగిరిలో ఉన్నాయని, ఓ రాష్ట్రంలో ఓసీ అనుకున్న కులం మరో రాష్ట్రంలో బీసీగా పరిగణించబడుతున్నందునా జనగణన సంపూర్ణంగా రాష్ట్ర ప్రభుత్వాలే చేపట్టి కులాల వారీగా లెక్కలు బయటకు తీయాలన్నారు. అలా చేస్తే కోర్టులు కూడా అడ్డుచెప్పే ఆస్కారం లేదని తమిళనాడు ఉదంతాన్ని చదివిన వ్యక్తిగా చెబుతున్నాన్నారు. ప్రస్తుతం మతం, కులం, జాతీయత దాస్తే దాగేవి కావన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నదని ఇంకా కులం ఎక్కడ ఉందనే వాళ్లు ఉన్నారు. కానీ ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ఈ దేశంలో ఇంకా కులం ఉందనేది వాస్తవం అన్నారు. అణగారిన జాతుల హక్కుల కోసం ఆర్.కృష్ణయ్య చేస్తున్న పోరాటాన్ని అభినందిస్తున్నాను. ఆయన పోరాటానికి మా సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

### ఎన్నికలకంటే ముందే రిజర్వేషన్లు పెంచాలి:

స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే బీసీ రిజర్వేషన్లు పెంచాలని ఈటల డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ కు మేము సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నామన్నారు. అన్నీ పార్టీలు మొదట బీసీలకు సముచిత స్థానం కల్పించి చూపించాలన్నారు. నాకు తెలిసి ఈ దేశంలో మొట్ట మొదటి సారి ఓబీసీల కేంద్ర మంత్రుల సంఖ్య ఎక్కువ ఉన్నది నరేంద్ర మోదీ కేబినెట్ లోనే అన్నారు. తెలంగాణలో ఇప్పటి వరకు ఓబీసీ ముఖ్యమంత్రి కాలేకపోయారు. ప్రజలు ఆశీర్వదిస్తే మేము ఓబీసీ వ్యక్తిని సీఎం చేస్తామని మోదీ ప్రకటన చేశారని గుర్తు చేశారు.కాంగ్రెస్ సర్కార్ పేదల కళ్లలో మట్టి కొడుతోందని, కేసీఆర్ కూడా ఇలాగే విర్రవీగి ఏమయ్యాడో చూశారని మల్కాజ్ గిరి బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు.ఇవాళ మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం మల్లంపేట గ్రామంలో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యమానికి హాజరైన ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డిని ఎన్నుకున్న పాపానికి హైదరాబాద్‌లోని పేదలకు కంటిమీద కునుకు లేకుండా పోయిందని అన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ ఇంకా ఎంతమంది పేదల కళ్ళలో మట్టి కొడుతుందని, ఎంతమంది జీవితాలను బుగ్గిపాలు చేస్తుందని మండిపడ్డారు. అలాగే దీనికి మూల్యం చెల్లించక తప్పదని, నీయబ్బ జాగీరా అని అడుగుతున్నామని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కూడా ఇలానే విర్రవీగాడని.. చివరికి ఏమయ్యాడో చూశారని, దెబ్బ కొడితే దిమ్మ తిరిగిందని అన్నారు. ఇక పేదల బ్రతుకుల్లో మట్టి కొడితే వారి ఉసురు తగలకుండా పోదని ఈటెల హెచ్చరించారు.

# ఒకే ఒక్క పరిష్కారం..హెజ్‌బొల్లా అంతం



అగ్రరాజ్యం అమెరికా తోపాటు, ఫ్రాన్స్ జోక్యం చేసుకున్నా ఫలితం కనిపించడం లేదు.అమెరికా, ఫ్రాన్స్ 21 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇజ్రాయెల్ తిరస్కరించింది. హెజ్‌బొల్లాను అంతం చేయడం ద్వారా మాత్రమే ఉత్తర సరిహద్దుల్లో చోటు చేసుకున్న ప్రతిష్టంభనకు పరిష్కారం దొరుకుతుందని స్పష్టం చేసింది. "ఉత్తరాదిలో చోటు చేసుకున్న సమస్యకు ఒకే ఒక్క పరిష్కారం ఉంది. అదే హెజ్‌బొల్లాను అంతం చేయడం" అని ఇజ్రాయెల్ రెవెన్యూశాఖ మంత్రి స్మోట్రిచ్ వెల్లడించారు. అమెరికా, ఫ్రాన్స్ చెప్పినట్లుగా కాల్పుల విరమణ ఒప్పందం చేసుకుంటే హెజ్‌బొల్లా కోలుకునేందుకు సమయం ఇచ్చినట్లవుతుందని వ్యాఖ్యానించారు.మరోవైపు బుధవారం రాత్రి బెకా వ్యాలీ, దక్షిణ లెబనాన్‌లోని సుమారు 75 హెజ్‌బొల్లా స్థావరాలపై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. ఫైర్ లాంచర్లు, ఆయుధ భాండాగారాలను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. అంతకుముందు ఇజ్రాయెల్-లెబనాన్ సరిహద్దులో కొనసాగుతున్న ఉద్రిక్తతలపై లెబనాన్ ప్రధాని నజీబ్ స్పందించారు. కాల్పుల విరమణ ఒప్పందం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### అమెరికా, ఫ్రాన్స్ ప్రయత్నాలు విఫలం

ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య సంధి కుదిర్చేందుకు అమెరికా, ఫ్రాన్స్ తీవ్రంగా ప్రయత్నించాయి. 21 రోజుల పాటు కాల్పుల విరమణకు ఇరు వర్గాలు అంగీకరించాలని తీర్మానించాయి. దీనికి యూరోపియన్ యూనియన్‌తోపాటు పలు అరబ్ దేశాలు మద్దతు పలికాయి. వెంటనే దీనిని అమలు చేసేలా ఇరు వర్గాలు కార్యాచరణ ప్రారంభించాలని కోరాయి. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్, ఫ్రాన్స్ ప్రధాని ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. కాల్పుల విరమణకు రావాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు"గత ఏడాది అక్టోబరు 7న మొదలై, ముఖ్యంగా రెండు వారాల క్రితం నుంచి జరుగుతున్న కాల్పుల వల్ల సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక పౌరులకు ఇవి శరాఘాతంగా మారుతున్నాయి. కాల్పుల విరమణకు అంగీకరించి సాధారణ పౌరులంతా వాళ్ల స్వస్థలాలకు వెళ్లేందుకు వీలు కల్పించాలి" అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వైమానిక దాడులతోపాటు లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై భూతల దాడులు చేసేందుకు ఇజ్రాయెల్ సిద్ధంగా ఉందని ఆ దేశ మిలటరీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ హెర్జీ హలేవి ప్రకటించిన నేపథ్యంలో అగ్రదేశాలు ఈ ప్రకటన చేశాయి.

### యుద్ధాన్ని ఆపొద్దు: నెతన్యాహు

అమెరికా, ఫ్రాన్స్ సంధి ప్రతిపాదనలపై నెతన్యాహు స్పందించలేదని అజ్రాయెల్ ప్రధాని కార్యాలయం స్పష్టం చేసింది. పూర్తి స్థాయి దళాలతో హెజ్‌బొల్లాతో పోరాటం చేయాలని నెతన్యాహు ఆదేశించినట్లు పేర్కొంది.

సాక్షి చదివినా,చూసినా ఆరోగ్యానికి హానికరం

సాక్షి చదివినా, చూసినా ఆరోగ్యానికి హానికరం. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ చేయబోమని కేంద్రమంత్రి కుమారస్వామి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టంగా చెప్పారు. ప్రైవేటీకరణ లేదని నేను, మా ఎమ్మెల్యేలందరం నిన్న స్పష్టంచేశాం. విశాఖ ఉక్కును బతికించడం కోసం నిధులు మంజూరు చేయాల్సిందిగా ముఖ్యమంత్రి కేంద్రాన్ని కోరారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించారు. వైసీపీ నాయకులు ఎందుకు కంగారు పడుతున్నారో అర్థం కావడం లేదు. ఇటీవల వరదలు సంభవించిన సమయంలో కష్టకాలంలో ఉన్న ప్రజలకు మేం అండగా నిలబడ్డాం. జగన్ ప్రజాధనంతో 2 బుల్లెట్ ప్రూఫ్ కార్లు కొనుక్కున్నారు కానీ ఏ నాడు జనం ముందుకు వెళ్లలేదు. ఎవరు అసలైన ప్రజానాయకులో రాష్ట్రప్రజలకు అర్థమైంది.

రెడ్ బుక్ పని ఇప్పటికే ప్రారంభమైంది

ఎవరైతే చట్టాన్ని ఉల్లంఘించారో వారికి శిక్ష తప్పదని నేను చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నా. ఆ ప్రకారం ఇప్పటికే రెడ్ బుక్ అమలు ప్రారంభమైంది. చట్టాన్ని అతిక్రమించి తప్పు చేసిన వారిని వదిలేది లేదు. ఇందులో భాగంగా ఐపీఎస్ లు కూడా సస్పెండ్ అయ్యారు. రైట్ ప్లేస్ లో రైట్ పర్సన్ ఉండాలన్నదే మా ప్రభుత్వ అభిమతం.విశాఖలో పర్యటిస్తున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రెండో రోజు ఉదయం టీడీపీ పార్టీ జిల్లా కార్యాలయంలో "ప్రజాదర్బార్" నిర్వహించారు.మంత్రి లోకేష్‌ను స్వయంగా కలిసి ప్రజలు తమ సమస్యలు విన్నవించారు. ప్రతి ఒక్కరి

# డిక్లరేషన్ సాంప్రదాయాన్ని జగన్ పాటిస్తే బాగుంటుంది!

విజ్ఞప్తిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ నర్స్ స్ట్రగుల్ కమిటీ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ విధానంలో డీఎంఈ, ఏపీవీవీపీ, డీపీహెచ్, ఎన్‌హెచ్ఎం విభాగాలలో పనిచేస్తున్న నర్సులను రెగ్యూలర్ చేయాలని, వంద శాతం గ్రాస్ జీతం అమలు చేయాలని, పరస్పర అంగీకార బదిలీలు అమలు చేయాలని, బీమా అందించాలని కోరారు. జర్నలిస్టులకు 4 సెంట్లు చొప్పున ఉచితంగా ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు రూ.10వేల పెన్షన్ సదుపాయం, కరోనాతో మృతి చెందిన వారికి పరిహారం తదితర సమస్యలు పరిష్కరించాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.అనకాపల్లి మండలం కోడూరులో ఎక్స్ సర్వీస్ మెన్ కోటాలో తమ తండ్రికి కేటాయించిన 5.22 ఎకరాల భూమిని వైసీపీ అండతో ఆక్రమించారని, విచారించి తగిన న్యాయం చేయాలని ఎస్. నాగమణి, జి. జయలక్ష్మి కోరారు. డీఎస్సీ 2008 నోటిఫికేషన్‌లో ఎంపికై నష్టపోయిన అభ్యర్థులకు తగిన న్యాయం చేయాలని ఏపీ వెలుగు టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. రష్యాలో వైద్య విద్య అభ్యసిస్తున్న తమ పిల్లలకు ఎన్టీఆర్ విదేశీ విద్య దీవెన బీసీ ఓవరసీస్ స్కాలర్షిప్ మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటిందనే నెపంతో గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని విస్తృత దళిత సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు కోరారు.ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, గత వైసీపీ ప్రభుత్వంలో దళితుల హత్యలు, దాడుల పై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ సుధాకర్ అంశం, వైకాపా ఎమ్మెల్సీ అనంత బాబు చేతిలో హత్యకు గురైన డ్రైవర్ సుబ్రహ్మణ్యం, కోడికత్తి శ్రీను, కిరణ్ కుమార్ హత్య వంటి కేసులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. భర్త చనిపోయిన తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయడంతో పాటు జీవనోపాధి కల్పించాలని విశాఖకు చెందిన గంటిపిల్లి నూకరత్నం విజ్ఞప్తి చేశారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం పార్టీ కార్యాలయానికి పెద్ద ఎత్తున చేరుకున్న నేతలు, కార్యకర్తలను కలిశారు. వారితో కలిసి ఫొటోలు దిగారు.రూ.250 కోట్లు ఉండాలన్న నిబంధనను వైవి సుబ్బారెడ్డి రూ.150 కోట్లకు తగ్గిస్తూ ఎందుకు సవరించారు? తిరుమలలో జరిగిన అవకతవకలపై నిగ్గు తేల్చేందుకు కమిటీ వేశాం. ఆ కమిటీ విచారణలో వాస్తవాలు బయటకు వస్తాయి. ఇప్పుడు తిరుమల లడ్డూ క్వాలిటీ బాగుందని వైసీపీ ప్రజాప్రతినిధులు కూడా చెబుతున్నారు.

# కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విధ్వంసమే



అస్థిరత రాజ్యమేలుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌కు అధికారం అప్పగించవద్దని ప్రజలకు సూచించారు. బుధవారం హరియాణాలోని సోనిపట్ జిల్లా గొహానాలో ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అస్థిరత, అవినీతి, బంధుప్రీతి తదితర అవలక్షణాలన్నీ ఉంటాయని ఆరోపించారు. కర్ణాటకలో ఇప్పుడు అలాంటి పరిస్థితే ఉందని గుర్తుచేశారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మధ్య అంతర్గత యుద్ధం సాగుతోందన్నారు. తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్‌లోనూ అదే కథ అని పేర్కొన్నారు. అందుకే కాంగ్రెస్ పట్ల హరియాణా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

### కాంగ్రెస్ పాలనలో బడుగులకు అన్యాయం

రిజర్వేషన్లను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని ప్రధానమంత్రి మండిపడ్డారు రిజర్వేషన్ల పట్ల ద్వేషం కాంగ్రెస్ డీఎన్ఏలోనే ఉందని విమర్శించారు. అందుకే కాంగ్రెస్ రాజ కుటుంబంలోని నాలుగో తరం రిజర్వేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తోందని ఆరోపించారు. ఆ పార్టీ అధికారంలో లేనప్పుడే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు హక్కులు లభించాయని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఆయా వర్గాల హక్కులను లాక్కుందని, తీరని అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు.

### పారిశ్రామికీకరణతో పేదలు, రైతులు, దళితులకు లబ్ధి

ఇటీవల జరిగిన అమెరికా పర్యటన గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు. అమెరికాలో పలువురు ముఖ్య నాయకులను, ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులను కలిశానని చెప్పారు. భారతీయ యువత నైపుణ్యాల గురించి వారికి వివరించానని అన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద కంపెనీలు నేడు భారత్‌లో ఫ్యాక్టరీలు ప్రారంభించేందుకు ఆసక్తి చూపుతున్నాయని వెల్లడించారు. దేశంలో పారిశ్రామికీకరణ పెరిగితే పేదలు, రైతులు, దళితులు అధికంగా లబ్ధి పొందుతారని స్పష్టంచేశారు. పరిశ్రమలు, వ్యవసాయ రంగాల్లో బీజేపీ ప్రభుత్వం హరియాణాను అగ్రశ్రేణి రాష్ట్రంగా తీర్చిదిద్దిందని ఉద్ఘాటించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ బీజేపీకి ఆదరణ నానాటికీ పెరుగుతోందని, కాంగ్రెస్ దిగజారిపోతోందని వివరించారు. రాష్ట్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని మోదీ ధీమా వ్యక్తంచేశారు.

## దేవాలయ శిల్పులను ప్రభుత్వం ఆదుకోవాలి - ప్రభుత్వం వారు సబ్ సీడి పద్ధతి లో శిల్పశాల లు ఏర్పాటు కీ సహాయం అందించాలి



కల్లూరు (ప్రభాత సూర్యుడు):మండల పరిధిలో ముగ్గువెంకటాపురం గ్రామ పంచాయితీ లో గల చైతన్య నగర్ యూవత దేవాలయం నిర్మాణం, దేవాలయ విగ్రహాల తయారీ చేయుటకు పెట్టింది పేరు. ఇక్కడ దేవాలయాల నిర్మించడానికి కానీ ఆ దేవాలయంలో మరియు గుడి పైన విగ్రహాలు చెయ్యడం లో ప్రసిద్ధ కళాకారులూ ఉన్నారు. చైతన్య నగర్ అనే చిన్న పల్లెటూరు నుండి వివిధ గ్రామలకు మరియు , మండల, జిల్లా, రాష్ట్ర లకు వెళ్లి దేవాలయం నిర్మాణ పనులను చేస్తారు. దేవాలయం లో విగ్రహాల ను అద్భుతం గా తయారు చేస్తారు.కానీ ఆన్ సీజన్ లో పనులు దొరకక పోవడం ఇబ్బందులు కీ గురించేస్తున్నది అనీ వారు తెలిచేసారు. మొత్తం మీద ఈ దేవాలయ శిల్పులు గా ఉన్నవారికీ ఆన్ సీజన్ లో కూడా పని కలిపించే విధంగా దేవాలయ శిల్పాశాలలు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం వారు రాయితి పద్ధతి లో లోన్ లు ఇప్పిస్తే శిల్పాశాల లు ఏర్పాటు చేసుకుని ఆన్ సీజన్ లో విగ్రహాలు తయారు చేసుకుని సీజన్ లో సెల్ చేసుకోవచ్చు అనీ ప్రభుత్వం వారిని కోరుకుంటున్నారు దయచేసి ప్రభుత్వం వారు స్పందించి ఈ శిల్ప కళాకారుల ను ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వం ద్రుష్టి కీ తీసుకోని వెళ్ళాలి అనీ కోరుకుంటున్నా శిల్పాకళాకారులు .ఈ కార్యక్రమం లో చైతన్య నగర్ కీ చెందిన దేవాలయ శిల్ప కళాకారులూ కళ్లేపల్లి మాధవ రావు, కళ్లేపల్లి రమేష్, రాయల వెంకటేశ్వరరావు(పండు ),కళ్లేపల్లి మల్లయ్య, సంగసాని సుబ్బారావు,దంతెలపల్లి సాంబ, దంతలపల్లి చిన్న బాబు, కళ్లేపల్లి కృష్ణ, చిన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

## పల్లె పకృతి వనం లో కోనో కార్పస్ చెట్లు తొలిగిపు

-సత్తుపల్లి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కోనో కార్పస్ చెట్లు ను తొలిగించండి.




కల్లూరు -(ప్రభాత సూర్యుడు):నియోజకవర్గంలో గల అన్ని పంచాయితీ లలో ఉన్న కోనో కార్పస్ చెట్లనుతొలిగించాలని నియోజకవర్గం లో ఉన్న అన్ని గ్రామలలో ఉన్న కార్యదర్శి లను ఆదేశించిన విష్యం తెలిసిందే. అదే ఆదేశాలను మండల పరిధిలో పేరువంచ గ్రామ పంచాయితీ కార్యదర్శి రోజు ఆచరణ లో పెట్టారు. ఈ కోనో కార్పస్ చెట్ల వల్ల ప్రజలు ఆరోగ్యం సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువ గా ఉన్నందున, అలాగే భూగర్భ జలాలు పూర్తి గా తగ్గిపోయే అవకాశం ఉన్నందున ఈ మొక్కలు తొలిగించాలని సలహా మేరకు పల్లె పకృతి వనం లో నాటిన కోనో కార్పస్ చెట్లునుఎట్టి కేలకు తొలిగించారు ఈ కధనం కూడా ప్రభాత సూర్యుడు న్యూస్ లో గతంలో ప్రచురించిన విష్యం తెలిసిందే. ఈ కార్యక్రమం లో పంచాయితీ కార్యదర్శి రాజు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కీసర రవీందర్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది రాచబంటి గోపాల్ రావు,గుమ్మా పల్లారావు, పప్పుల. వెంకటేశ్వరరావు, సురేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

## భరతమాత దాస్య శృంఖాలల విముక్తికై ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన వీరుడు భగత్ సీంగ్



కల్లూరు-(ప్రభాత సూర్యుడు): షహీద్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆ మహా విప్లవకారుడికి శత కోటి వందనాలు తెలియచేస్తూ పేరువంచ భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో కల్లూరు నూతన బస్ స్టాండ్ లో ఏర్పాటు చేసిన భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్.ఈ కార్యక్రమం లో ఏ.యం.సి చైర్మన్ నీరజ ప్రభాకర్ చౌదరి,రాష్ట్ర హ్యూమన్ రైట్స్ అధ్యక్షురాలు యనమల రుక్మిణి,కల్లూరు మండల సీనియర్ నాయకులు చంద్రరావు, ప్రభాకర్ చౌదరీ,ఏనుగు సత్యంబాబు ,అలకుంటనరసింహారావు , చిత్తూలూరి నరేష్, నగేష్, పేరువంచ గ్రామ నాయకురాలు కీసర నిర్మల, పేరువంచ గ్రామ నాయకులు కీసర మోహన్ రెడ్డి, భగత్ సింగ్ యూత్ అధ్యక్షులు పరిమి భరత్, ఉపాధ్యక్షులు కోట బన్నీ, కొండపల్లి మురళి,గోపాలరావు,అశోక్, వంశీ, వెంకట చారీ,బాబీ,ప్రసాద్, బడుగు వెంకటేశ్వరావు, సన్నీ, దొడ్డి యేసురెడ్డి,యల్లేశ్వరావు, కొండపల్లి వంశీ,కల్లూరు మండల నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి యువజన ఉత్సవ పోటీలలో సత్తా చాటిన పటాన్ చెరువు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

పటాన్ చెరు -(ప్రభాత సూర్యుడు):సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి యువజన ఉత్సవ పోటీలలో పటాన్చెరువు విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వ, ఫోటోగ్రఫీ, చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులను మరియు పద్య రచన పోటీలో ద్వితీయ బహుమతులను గెలుపొందినట్లు తెలిపారు. మేఘన, నిఖిల్, సంతోష, కిషోరి, చరణ్, సుధాకర్ తదితర విద్యార్థులను ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఈ సందర్భంగా ప్రశంసించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన ఈ విద్యార్థులు వచ్చే నెలలో హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి యువజన పోటీలకు ఎంపికైనట్లు సంగారెడ్డి జిల్లా యువజన మరియు క్రీడల అధికారి ఖాసిం బేగ్ ప్రకటించినట్లుగా తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించి, వారి ప్రగతికి కృషి చేస్తున్న ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఆకుల వెంకటేశం, కరుణ కుమారి లను అభినందించారు. గెలుపొందిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నేడు కళాశాలలో జరిపినట్లు, ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రవీణ, ఐపీఎస్సీ కోఆర్డినేటర్ పూనమ్ కుమారి, డాక్టర్ యోగి బాబు డాక్టర్ సుజాత, డాక్టర్ మంజుశ్రీ, సురేష్ కుమార్, వెంకటేశ్వర్లు, మల్లిక మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన

# ప్రభాత సూర్యుడు కథనానికి భారీ స్పందన

- ప్రభాత సూర్యుడు వార్త కథనంతో స్పందించిన అధికారులు

- 45 సంవత్సరాలుగా నిరుపయోగంలో ఉన్న రోడ్డు నేడు అందుబాటులోకి







కల్లూరు - (ప్రభాత సూర్యుడు):ప్రభాత సూర్యుడు దినపత్రికలో శనివారం ప్రచురితమైన ఎన్టీఆర్ కాలనీలో బజారుని వాడుకలోకి తీసుకురండి సారు కథనానికి భారీ స్పందన లభించింది. గత 45 సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్నటువంటి రోడ్డు త్వరలో అందుబాటులోకి రానుంది. దీంతో వాహనదారులు, గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బందులకు తెరపడింది. మండల పరిధిలో పేరువంచ గ్రామ పంచాయితీ ఎన్టీఆర్ కాలని ఏర్పాటై సుమారుగా 45-50 సంవత్సరాలు గడిచిన, కాలనీకి తూర్పు వైపున డాంబర్ రోడ్డు వద్ద ఉన్న సెవెంత్ డే చర్చి పక్కన నుండి యన్.యస్.పి కాలువ కట్ట వరకు ఉన్న బజారు అక్కడ నివాసులు అక్రమణ చేసి చెత్త చెదారం, పెద్ద పెద్ద వేప చెట్లు, తాటి చెట్లు,వేదురు చెట్లు భారీగా పెరిగి పెద్ద పెద్ద వనం లా మారింది. ఇప్పుడు ఆ బజారు వారు కొందరు ఇళ్ళకి తూర్పు వైపు రోడ్డు కావాలి అనీ పలుమార్లు పంచాయితీ అధికారులు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో ప్రభాత సూర్యుడు దినపత్రిక ప్రజలు పడుతున్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చింది. దీంతో వెంటనే స్పందించిన పంచాయితీ కార్యదర్శి రాజు తన సిబ్బందితో పాటుగా జేసీబీని పంపించి బజారు లో పెద్ద పెద్ద వేప చెట్లు, తాటి చెట్లు, వేదురు చెట్లు, చెత్త పిచ్చి పోదలు తొలిగించి బజారుగా కనిపించే లా సిద్ధం చేశారు అలాగే ఎండలు మొదలయిన తరువాత మట్టి తొలించి డ్రైనేజీ లు తీయించి అవకాశం బట్టి సీసీ రోడ్డు మంజూరు చేసే విధంగా కృషి చేస్తా అనీ పంచాయితీ కార్యదర్శి రాజు అన్నారు. పంచాయతీ కార్యదర్శి తో పాటుగా పంచాయితీ సిబ్బంది కీ ప్రజలు అభినందనలు తెలిపారు. 45 ఏళ్ళ తరువాత వాడుక లోకి వస్తున్న బజారును చూసి స్థానిక ప్రజలు ఆనందం వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమం లో పంచాయితీ కార్యదర్శి రాజు, పంచాయితీ సిబ్బంది రాచబంటీ. గోపాల్ రావు, గుమ్మా.పుల్లారావు,పప్పుల. వెంకటేశ్వరరావు, బట్టు.రామకృష్ణ మరియు కాంగ్రెస్ నాయకులు కిసర రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.



# సాగర్ జలాలతో చెరువును నింపాలి



-ఆర్డీవోను కలిసిన సంగారెడ్డి ఆయకట్టు రైతులు



కల్లూరు (ప్రభాత సూర్యుడు):సాగర కాలువ తూము తెరిచి సంగారెడ్డి చెరువును నీళ్లతో నింపి రైతులు సాగు చేస్తున్న వరి పంటలను కాపాడాలని సంగారెడ్డి ఆయకట్టు రైతులు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎల్ రాజేందర్ గౌడ్ ను శనివారం ఆయన కార్యాలయంలో కలిసి తమగోడు వెల్లబుచ్చుకున్నారు. ఎన్నో ఏళ్లుగా మండల పరిధి లో కల్లూరు,లక్ష్మీపురం,పుల్లయ్య బంజర రెవెన్యూ పరిధిలో సంగారెడ్డి చెరువు ఆయకట్టు కింద సుమారు 670 ఎకరాలలో సన్న చిన్నకారు రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. చెరువు మునక పట్టా రైతులు హైకోర్టును ఆశ్రయించి చెరువు మరమ్మతులు చేపట్టకుండా అలుగు కట్టకుండా స్టే తీసుకొచ్చి ఆయకట్టు రైతులను ఇబ్బంది పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపాతంతో చెరువు నిండటం వలన ఆయకట్టు రైతులు వరి పంటను సాగు చేశారు. ప్రస్తుతం చెరువులో నీళ్లు లేక పొట్టదశ లో ఉన్న వరి పైరు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. వర్షాలు వలన చెరువు నిండడంతో గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి వేళలో అలుగు ధ్వంసం చేయటం వంటి సంఘటనలతో చెరువులో నీళ్లు పోయిన పరిస్థితి ఏర్పడడంతో మేమే మా సొంత నిధులతో గండి పుడ్చటం జరిగిందని తెలిపారు. వరి సాగు చేస్తున్న 670 ఎకరాలు నీరంధక చెరువులో నీళ్లు లేక పంటలు ఎండిపోయే ప్రమాదం పొంచి ఉందని సాగర్ కాలువ తూము తెరిచి నీళ్లతో చెరువు నింపి పంటలను కాపాడాలని రైతులు ఆర్డీవోను వేడుకొన్నారు. ఇప్పటివరకు కాలువ ద్వారా చెరువును నింపి రెండు పంటలకు సాగునీరు అందించి అధికారులు రైతులకు సహకరించారని అన్నారు. ప్రస్తుతం చెరువులో నీళ్లు లేనందున చేతికొచ్చిన వరి పంట ఎండిపోయే దశలో ఉన్నందున వెంటనే సాగర కాలువ తూము తెరిచి నీళ్ళు తో చెరువు నింపితే చిన్న సన్న కారు రైతు కుటుంబాలు కాపాడబడతాయని వారి పేర్కొన్నారు.అధికారులు ఏ మాత్రం నిర్లక్ష్యం చేసిన లక్షాలాధి రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు ఆత్మహత్య చేసుకునే ప్రమాదం పొంచిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా మంత్రులు,స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి నీళ్లు ఇచ్చి ఎండిపోతున్న పంటలను కాపాడాలని కోరారు.

### స్పందించిన ఆర్డిఓ

సంగారెడ్డి ఆయకట్టు రైతులు ఆర్డీవో కలిసి తమ గోడును వెల్లబుచ్చుకున్న వెంటనే స్పందించిన ఆయన సంబంధిత ఇరిగేషన్ అధికారులను పిలిపించి రైతుల సమక్షంలో మాట్లాడటం జరిగింది. సంగారెడ్డి చెరువు విషయంలో జిల్లా కలెక్టర్ సంబంధిత నివేదికను వారు అడగడంతో అధ్యయనం చేసి నివేదికను కలెక్టర్ కు పంపించడం జరిగిందని తెలిపారు.సుమారు 670 ఎకరాలకు సాగర్ జలాలు తో రైతులకు రెండు పంటలకు నీరు అందించే విధంగా శాశ్వత పరిష్కార దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉబ్బన గోపాల స్వామి, బొల్లం నాగరాజు,ఉబ్బన రాంబాబు, దామాల కిషోర్, గుండ్ల లాలయ్య, మద్దిబోయిన వెంకటేశ్వరరావు, కోట శ్రీనివాసరావు, బొడ్డు వీరస్వామి, బొడ్డు మరళి, తిరుపతిరావు ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

## కోలాటం కళాకార బృందం కీ మువ్వలు బహుకర్ణ



**కల్లూరు (ప్రభాత సూర్యుడు):మండల పరిధిలో ముగ్గు వెంకటాపురం గ్రామ పంచాయితీ లో పిల్లలు మహిళలు కలిసి రామా లయం వద్ద నూతనంగా కోలాటం నేర్చుకుంటున్న కోలాటం బృందానికి బి.ఆర్.యస్ పార్టీ తరుపున మువ్వలు, కోలాటం కర్రలు బహుకరించిన నాయకులు వడ్లమూడి గంగాధర్ (నానాజీ ).ఈ కార్యక్రమం లో ముగ్గు వెంకటా పురం బి.ఆర్.యస్ సీనియర్ నాయకులు వడ్లమూడి గంగాధర్ (నానాజీ ),మెరుగు సంతోషరావు, జంజు కృష్ణయ్య, మెరుగు నాగరాజు, మెరుగు కృషయ్య,చిలకా నాగరాజు, చింతకాయల కోటయ్య, చింతల దుర్గ, మెరుగు పుల్లారావు, మెరుగు నరసింహారావు,పిట్టల బాలాజీ, మెరుగు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.**

## హుబ్బళ్లి-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌లో భారీ దొంగతనం

3.5 కిలోల బంగారు ఆభరణాల అపహరణ



కర్నూలు: కర్ణాటకలోని హుబ్బళ్లి నుంచి విజయవాడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో శనివారం ఉదయం రూ.2.5 కోట్ల విలువైన 3.5 కిలోల బంగారు ఆభరణాలను దొంగలు అపహరించారు.బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన కాశీ విశ్వనాథ్, రంగారావు సత్తెనపల్లిలో 'సాయిచరణ్ జ్యువెలర్స్' పేరుతో బంగారు ఆభరణాల వ్యాపారం చేస్తున్నారు. వీరు ఆభరణాలను తయారుచేసి కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో విక్రయిస్తుంటారు. అందులోభాగంగా రంగారావు, ఆయన సోదరుడు సతీశ్‌బాబుతో కలిసి బంగారు ఆభరణాలను తీసుకొని మంగళవారం రాత్రి సత్తెనపల్లి నుంచి బళ్లారి వెళ్లారు. మూడు రోజులపాటు బళ్లారిలో ఉండి పలు దుకాణాల వ్యాపారులను సంప్రదించినా.. వారు ఆభరణాల కొనుగోలుకు ముందుకు రాలేదు. దీంతో శుక్రవారం రాత్రి హుబ్బళ్లి-విజయవాడ రైలులో తిరుగు ప్రయాణమయ్యారు.నంద్యాల వరకు మెలకువగా ఉన్నా, తర్వాత ఆభరణాలున్న బ్యాగును రంగారావు తన తల కింద పెట్టుకొని నిద్రపోయారు. రైలు దొనకొండ సమీపానికి వచ్చేముందు మెలకువ వచ్చి చూసుకోగా బ్యాగు కనిపించలేదు. దీంతో వెంటనే రైలుదిగి దొనకొండ రైల్వే స్టేషన్‌కు శనివారం ఉదయం ఏడు గంటల సమయంలో వెళ్లారు. అక్కడ రైల్వే పోలీసుస్టేషన్ లేకపోవడంతో.. కొందరు మార్కాపురం వెళ్లాలని సూచించగా అక్కడికి వెళ్లారు. అక్కడివారు నరసరావుపేట వెళ్లాలని చెప్పడంతో మధ్యాహ్నం 12 గంటలకు అక్కడికి వెళ్లారు. అక్కడి రైల్వే పోలీసులు సాయంత్రం వరకు రకరకాల ప్రశ్నలు అడిగి, చివరికి దొంగతనం జరిగిన ప్రాంతం నంద్యాల రైల్వే పోలీసుల పరిధిలోకి వస్తుందని, అక్కడికి వెళ్లాలని సూచించారు. దీంతో వారు రాత్రి నరసరావుపేట నుంచి బయలుదేరి నంద్యాల రైల్వే పోలీసుల వద్దకు వెళ్లారు. చోరీ జరిగిందని తెలిసినా.. దొంగలను పట్టుకునేందుకు వెంటనే స్పందించకపోగా.. కనీసం కేసు నమోదుచేయకుండా రైల్వే పోలీసులు పరిధి పేరుతో నిర్లక్ష్యం ప్రదర్శించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## జగన్ కు ఆ ధైర్యం లేక చిన్నగా జారుకున్నారు, అంతేగా, బీజేపీ మంత్రి



**అమరావతి,:** వైసీపీ అధినేత వైయస్ జగన్ తిరుమల పర్యటన రద్దు చేసుకుని ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. తనను కావాలనే తిరుమలకు పంపించలేదని, తాను తిరుమల వెళ్లకుండా పోలీసులు నోటీసులు జారీ చేశారని, ఇది ప్రజాస్వామ్యంపై దాడి అని మాజీ సీఎం జగన్ శుక్రవారం చంద్రబాబు నాయుడు ప్రభుత్వంపై ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. జగన్ ఆరోపణలపై ఇప్పటికే కూటమి ప్రభుత్వంలోని మంత్రులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. జగన్ ఆరోపణలను టీడీపీ, జనసేన నాయకులు ఖండించారు. ఇప్పుడు జగన్ విషయంలో బీజేపీ ఎంట్రీ ఇచ్చింది. జగన్ కావాలనే తిరుమల పర్యటన రద్దు చేసుకొని కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. ధర్మవరంలో మీడియాతో మాట్లాడిన మంత్రి సత్య కుమార్ మాజీ సీఎం జగన్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుమలలో డిక్లరేషన్ పై సంతకం చేసే ధైర్యం లేక జగన్ తిరుమల పర్యటన రద్దు చేసుకున్నారని మంత్రి సత్యకుమార్ ఆరోపించారు. తిరుమలకు వెళ్లే ధైర్యం లేక మాపైన జగన్ ఆరోపణలు చేయడం సరికాదని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శ్రీవారి లడ్డు ప్రసాదంలో వినియోగించే నెయ్యి విషయంలో జగన్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారని ఆంధ్రప్రదేశ్ మంత్రి, బీజేపీ నాయకుడు సత్యకుమార్ ఆరోపించారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయన బాబాయ్ వైవీ. సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్ అయ్యారని, ఆ తర్వాత జగన్ కు అత్యంత సన్నిహితుడు భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీ చైర్మన్ అయ్యారని మంత్రి సత్యకుమార్ యాదవ్ గుర్తు చేశారు. ఆ సందర్భంలో వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన ఏవీ. ధర్మారెడ్డిని టీటీడీ ఈవోగా నియమించారని, ఆ సమయంలోనే శ్రీవారి లడ్డు తయారు చేయడానికి కల్తీ నెయ్యి ఉపయోగించారని మంత్రి సత్యకుమార్ ఆరోపించారు. మాజీ సీఎం జగన్, వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, ఏవి ధర్మారెడ్డిని ఆ వెంకటేశ్వరస్వామి ఎట్టి పరిస్థితుల్లో క్షమించరని, త్వరలోనే ఆ దేవుడు వీళ్లకు సరైన శిక్ష విధిస్తారని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. కోట్లాదిమంది శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన వాళ్ళు ఎవ్వరు కూడా శ్రీవారి లడ్డూ కల్తీ నెయ్యి కేసు నుండి తప్పించుకోలేరని, అందరికీ సరైన శిక్ష పడుతుందని మంత్రి సత్యకుమార్ అన్నారు. జగన్, వైసీపీ నాయకులు చేసిన ఆరోపణలపై ఇప్పటికే టీడీపీ, జనసేన నాయకులు కౌంటర్ ఇవ్వడంతో ఇప్పుడు బీజేపీ మంత్రి సత్యకుమార్ కూడా ఘాటుగా జగన్ కు కౌంటర్ ఇవ్వడంతో కథ రసవత్తరంగా మారుతుంది.

## నేపాల్‌లో వరదల బీభత్సం.. 39 మంది మృతి



ఖాఠ్‌మాండూ: నేపాల్ బీభత్సం సృష్టించాయి. నేపాల్‌లో గతకొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ఎనిమిది జిల్లాల్లో దాదాపు 39మంది మరణించారు. సుమారు 11మంది గల్లంతైనట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. ఆకస్మిక వరదలు పోటెత్తడంతో దేశంలోని అనేక ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయి. జనజీవనం స్తంభించింది. ఈ వరదలు మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని విపత్తు ప్రతిస్పందన అధికారులు హెచ్చరిస్తున్నారు. వరదలు పోటెత్తుతుండటంతో ఖాఠ్‌మాండూలో 9మంది, లలిత్‌పూర్‌లో 16 మంది, భక్తపూర్‌లో ఐదుగురు, కవ్రేపాలన్‌చౌక్‌లో ముగ్గురు, పంచతార్, ధన్‌కూటాలో ఇద్దరు, ఝాపా, ధాడింగ్‌లో ఒక్కొక్కరు చొప్పున మరణించినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. 226 ఇళ్లు పూర్తిగా నీటమునిగిపోయాయని, బాధిత ప్రాంతాల్లో దాదాపు 3,000 మంది భద్రతా సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని అధికారులు వెల్లడించారు. నేపాల్ సాయుధ పోలీసు దళానికి చెందిన 1,947 మంది భద్రతా సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నారు. వరద ప్రభావ ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి 23 రాఫ్టింగ్ బోట్లను సిద్ధం చేశారు. ఇప్పటి వరకు 760 మందిని రక్షించినట్లుగా వెల్లడించారు.

### బిహార్‌కు తీవ్ర వరద ముప్పు..

పొరుగు దేశం నేపాల్‌ను వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. కాగా ఈ ప్రభావం బిహార్‌పై పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడ నుంచి కొన్ని నదులు బిహార్‌లోకి ప్రవహిస్తాయి. ఆ నదులకు వచ్చే ఆకస్మిక వరదలు రాష్ట్రంలోని పలు ప్రాంతాలను ముంచెత్తే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పశ్చిమ, తూర్పు చంపారన్, సీతామర్హి, షెయొర్, ముజఫర్‌పూర్, గోపాల్‌గంజ్, సివాన్, సరన్, వైశాలి, పట్నా, జెహనాబాద్, మధుబని, భోజ్‌పూర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. ఆయా జిల్లాల యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కోసి, గండక్ నదులు ఉప్పొంగుతుండటంతో జలవనరుల శాఖ ఇప్పటికే వరద హెచ్చరికలు జారీ చేసింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా గండక్ నదిపై ఉన్న వాల్మీకినగర్ బ్యారేజీలో కొన్ని గేట్లను ఎత్తి 6.87 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు పేర్కొంది.

## ఇజ్రాయిల్ అంతటా "హై అలర్ట్"..
## హిజ్బుల్లా చీఫ్ మరణంతో మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తత..



హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లా ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లో మరణించినట్లు ఇజ్రాయిల్ ఆర్మీ ఈ రోజు చెప్పింది. బీరూట్‌లో జరిగిన దాడిలో అతను మరణించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే, నస్రల్లా మరణం తర్వాత ఇజ్రాయిల్ హై అలర్ట్‌లోకి వెళ్లింది. దేశవ్యాప్తంగా అప్రమత్తత ప్రకటించింది. ప్రజలు అలర్ట్‌గా ఉండాలని ఇజ్రాయిల్ మిలిటరీ శనివారం తెలిపింది. నస్రల్లా మరణం హిజ్బుల్లా చర్యల్ని మార్చడానికి కారణమవుతుందని ఇజ్రాయిల్ ఆర్మీ ఆశిస్తోంది. నస్రల్లాను చంపిన తర్వాత ఇజ్రాయిల్ ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ నదవ్ షోషాని మీడియా సమావేశంలో అన్నారు. అయితే, ఇరాన్ మద్దతు కలిగిన హిజ్బుల్లాను మరింత నాశనం చేయడానికి ఇంకా సమయం పడుతుందని ఆయన అన్నారు. ఒక ఏడాది కాలంలో హిజ్బుల్లా తమపై దాడులు చేయడాన్ని చూశానమని అన్నారు. ఇప్పటికే దేశంలోని చాలా ప్రాంతాలు హై అలర్ట్‌లో ఉన్నాయని చెప్పారు. ఈరోజు జరిగిన దాడిలో హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లా హతమయ్యారని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ చెప్పడంతో దేశానికి ముప్పు కలిగించే ఎవరినైనా లక్ష్యంగా చేసుకుంటామని ఇజ్రాయెల్ ఆర్మీ చీఫ్ ప్రతిజ్ఞ చేసింది. నస్రల్లాతో పాటు సదరన్ ఫ్రంట్ కమాండర్ అలీ కర్కీని కూడా చంపేశామని ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్ ధ్రువీకరించినట్లు ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎక్స్,లో పోస్ట్ చేసింది. ఈ పరిణామాలతో మిడిల్ ఈస్ట్ అట్టుడుకుతోంది.

## ఇరాన్ హై అలర్ట్.. సురక్షిత ప్రాంతానికి సుప్రీమ్ లీడర్




టెహ్రాన్: పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొంది. లెబనాన్ సరిహద్దుల్లో హెజ్‌బొల్లా లక్ష్యంగా ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులతో హెజ్‌బొల్లాకు భారీ నష్టం సంభవిస్తోంది. దక్షిణ బీరుట్‌లోని హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయంపై శుక్రవారం జరిపిన దాడుల్లో మిలటరీ గ్రూప్ అధిపతి హసన్ నస్రల్లా మరణించినట్లు తాజాగా ఇజ్రాయెల్ ఆర్మీ ధ్రువీకరించింది. అయితే నస్రల్లా మరణ వార్తలపై హెజ్‌బొల్లా కానీ, లెబనాన్ కానీ ఇంకా స్పందించలేదు. ఇదిలా ఉండగా దాడుల విషయంలో ఇజ్రాయెల్ సైన్యం దూకుడు ప్రదర్శిస్తున్న వేళ.. ఇరాన్ అప్రమత్తమైంది. తమ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని దేశంలోని సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది. ఆయనకు భద్రతా ఏర్పాట్లను కూడా పెంచినట్లు సమాచారం. ఈ మేరకు అంతర్జాతీయ కథనాలు పేర్కొన్నాయి. నస్రల్లాను అంతమొందించినట్లు తీయ మీడియా ఇజ్రాయెల్ ప్రకటించిన తర్వాత.. తదుపరి చర్యపై లెబనాన్, హెజ్‌బొల్లా, ఇతర ప్రాంతీయ గ్రూపులతో ఇరాన్ నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# అసందర్భ వ్యాఖ్యలు




బాలివుడ్ నటి, భారతీయ జనతాపార్టీ పార్లమెంట్ సభ్యురాలు కంగనా రనౌత్ ఇతరులమీద చేస్తున్న విమర్శల ప్రభావం ఏపాటిదో తెలియదు కానీ, తన దూకుడు వ్యాఖ్యలతో పార్టీకి మాత్రం నష్టం చేస్తున్నారు. రద్దయిన సాగుచట్టాలను తిరిగి తీసుకురావాలంటూ ఆమె చేసిన కొన్ని వరుస వ్యాఖ్యలమీద గురువారం హర్యానా బీజేపీ ప్రతినిధి విరుచుకుపడిన తీరు చూసినప్పుడు, ఈ హిమాచల్ ప్రదేశ్ మండీ ఎంపీ వ్యాఖ్యలతో హర్యానా రైతులకు బాగా మండిందని స్పష్టంగా అర్థమవుతుంది. హర్యానాని కాంగ్రెస్ వశం చేసుకోవడానికి మీరొక్కరు చాలు అని పార్టీ అభిమాన నెటిజన్లు ఆమెను వెంటాడుతున్నారు. పదిరోజుల్లో హర్యానాలో ఎన్నికలు ఉండగా ఆమె ఈ వ్యాఖ్యలతో ఏడాదిపాటు సాగిన సాగుచట్టాలవ్యతిరేక ఉద్యమాన్ని రైతులకు మళ్ళీ గుర్తుచేశారు. ఆ కాలంలో బీజేపీ పెద్దలంతా తమపట్ల ఎంత అమానుషంగా వ్యవహరించారో, ఎంతగా చులకనచేశారో రైతులకు గుర్తుకొచ్చి ఉంటుంది. మూడు వ్యవసాయచట్టాల విషయంలో పాలకుల అలనాటి కాఠిన్యానికి కంగన ఓ బలమైన ప్రతీక కనుక బీజేపీ ఇంతగా భయపడటం సహజం. గతంలో బీజేపీ అధినాయకులు సదరు చట్టాలపై వెలిబుచ్చిన అభిప్రాయాలకు, ఇప్పుడు ఆమె చేసిన వ్యాఖ్యలు భిన్నమైనవేమీ కావు. ఆర్థికంగా బలంగా ఉన్న కొన్ని రాష్ట్రాలకు చెందిన కొద్దిమంది రైతులు మాత్రమే ఈ మూడుచట్టాలను వ్యతిరేకిస్తున్నారని, దేశవ్యాప్త రైతుల ప్రయోజనాలను రైతుల ముసుగులో ఉన్న కొన్ని దుష్ట శక్తులు బలిపెడుతున్నాయని వారు అప్పట్లో వాదించారు. ఖలిస్తానీ తీవ్రవాదులు ఉద్యమంలో వచ్చిచేరారన్న విమర్శలు సైతం చేశారు. రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో మకాం వేసుకొని, ఎండకు ఎండుతూ వానకూ తడుస్తూ పోరాడుతూంటే సమస్త వ్యవస్థలూ సహాయ నిరాకరణ చేశాయి, విరుచుకుపడ్డాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖింపూర్‌లో కేంద్రమంత్రి కుమారుడు రైతులమీదకు తన కారుపోనిచ్చి కొందరి ప్రాణాలు తీసిన ఘటన దేశాన్ని కుదిపేసింది. రైతుల నిరసనను కేంద్రపాలకులు తమపై తిరుగుబాటుగా, భావిస్తున్నారనేందుకు ఇటువంటి అనేక ఉదాహరణలు ఆ కాలంలో ఉన్నాయి. ఆ పోరాటాన్ని అణచివేసేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో, ముంచుకొస్తున్న పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికల్లో ఓటమి భయంతో ఆ చట్టాలను రద్దుచేస్తున్నట్టుగా ప్రభుత్వం ప్రకటించింది. కేంద్రం వాటిని ఉపసంహరించుకున్నప్పటికీ, ఏడాదిపాటు సాగిన ఆ పోరాటాన్ని రైతులు గుర్తుంచుకుంటారు. ఆ కాలంలో నిరసనకారులను ఉగ్రవాదులుగా, దానిని ఖలిస్తానీ ఉద్యమంగా అభివర్ణించిన కంగనా రనౌత్ వంటివారిని మరీనూ. అప్పటి అవమానాలను ఎన్నేళ్ళయినా మరిచిపోరనడానికి ఈ ఏడాది జూన్‌లో కంగనమీద చండీగఢ్ విమానాశ్రయంలో ఒక సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చేసిన దాడి ఓ ఉదాహరణ. సాగుచట్టాలకు వ్యతిరేకంగా రైతుల ఉద్యమం అలాగే కొనసాగితే భారత్‌లోనూ బంగ్లాదేశ్ తరహా పరిస్థితులు తలెత్తేవని కంగన మరో వ్యాఖ్యచేశారు. మళ్ళీ సాగుచట్టాల ఊసుతెచ్చి, పార్టీ ఒత్తిడిమేరకు వెనక్కుతీసుకొని, ఆమె క్షమాపణలు కోరుతూండవచ్చు, అది ఆమె వ్యక్తిగత అభిప్రాయమంటూ పార్టీ కూడా చేతులుదులుపుకొనే ప్రయత్నం చేస్తుండవచ్చు. కానీ, మూడోమారు అధికారంలోకి రావాలనుకుంటున్న బీజేపీకి జాట్లు ఇప్పటికే దూరమైనారని విశ్లేషణలు వెలువడుతున్నాయి. మహిళా మల్లయోధుల ఉద్యమం పట్ల కేంద్రప్రభుత్వ వైఖరి కూడా ఇందుకు దోహదం చేసింది. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కంగన వ్యాఖ్యల ప్రభావం ఏ మేరకు ఉంటుందన్నది వేరే విషయం. కానీ, గతంలో బీజేపీ ప్రతినిధి ఒకరు ఓ టీవీ చర్చలో మహమ్మద్ ప్రవక్తమీద దూకుడు వ్యాఖ్యలు చేసి దౌత్యసమస్యలు తెచ్చిపెట్టిన ఉదాహరణ కూడా ఉన్నది కనుక కంగనవంటివారిని కంట్రోల్‌లో ఉంచడం అందరికీ మంచిది.

# ప్రజాక్షేమమే పాలకుల పరమావధి




ఏ కాలంలోనైనా ప్రజలు పాలకుడిని బట్టే ఉంటారని మన ప్రాచీన రాజనీతి బోధిస్తున్నది. అందుకే పెద్దలు "యథా రాజా తథా ప్రజాః" అన్నారు. అంటే పాలకుడు ధర్మబద్ధంగా ఉంటే ప్రజలు కూడా ధార్మికంగా నడుచుకుంటారు. పాలకుడు అవినీతికి పాల్పడితే ప్రజలు కూడా వెధవ ఆలోచనలు చేస్తుంటారు. ప్రజలు ఎప్పుడూ పాలకుడిని గమనిస్తూనే ఉంటారు. అందుకే బాధ్యత కలిగిన పాలకుడు పాలు తాగుతున్న పిల్లి తనని ఎవరూ గమనించడం లేదనుకున్నట్లు ఉండకూడదన్నది పెద్దల మాటలోని ఆంతర్యం. అంతేకాదు కోట్లాది ప్రజల బాగోగులను పట్టించుకోవడానికి భగవంతుడే పాలకుడిలో ప్రవేశించి అధికార స్థానంలో ఉన్నట్లుగా పద్ధతి గల పాలకుడు భావిస్తూ ఉండాలి. భారతీయ ధర్మశాస్త్రాలు "నా విష్ణుః పృథివీ పతిః" అని చెప్పడంలోని ఉద్దేశం అదే. కోటానుకోట్ల ప్రజల సంక్షేమాన్ని గురించి ఆలోచించి వాళ్ళని ఆదుకునే శక్తి, బుద్ధి, అవకాశం, అధికారం అందరికీ అంత తేలిగ్గా లభించవు. లభించిందంటే, ఆ వ్యక్తిలో దైవాంశ ఉంటే తప్ప అది జరగదు. అది తెలియక తమోగుణం పేట్రేగి స్వార్థంతో రాక్షసాంశను ప్రదర్శించిన పాలకుడు అవినీతి, అక్రమాలకు పాల్పడి ప్రజల సంపదను ఆస్తులను కాపాడకపోగా వాటిని దిగమింగటానికి ప్రయత్నిస్తాడు. అది చాలా దురదృష్టం. ప్రాచీన భారతీయ ధర్మ శాస్త్రాల్లోని ఆలోచన, తత్వం తెలిసి వాటి మీద అపారమైన భక్తి ప్రపత్తులు, విశ్వాసం కలిగిన వాళు భగవంతుడు కల్పించిన అధికార రూప అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చరిత్ర పురుషులుగా మిగిలిపోతారు. శ్రీకృష్ణదేవరాయల లాంటి వారిని ఇన్ని శతాబ్దాలు గడిచినా నేటికీ ప్రజలు మర్చిపోకుండా ఆయన పేరుతో ఉత్సవాలు జరుపుకోవడంలో ప్రధాన కారణం ఆయన తన అధికారాన్ని సద్వినియోగం చేసుకోవడమే. అలాకాకుండా అంది వచ్చిన అవకాశాన్ని దురహంకార, దుర్నీతులతో దుర్వినియోగం చేసుకున్నవాళ్లు నియంతలుగా, నికృష్టులుగా వర్తమాన, భావితరాల ఛీత్కారాలతో కాలగర్భంలో కలిసిపోతారు. అందుకే ఏ పాలకుడైనా ఏ కాలంలోనైనా అవలంబించవలసిన విధానం మొదటిదే. నాటి రాచరికపు వ్యవస్థలో ఉన్న రాజులు గానీ, నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్న పాలకులు గాని ఎల్లవేళలా ప్రజా సంక్షేమాన్ని గురించి ఆలోచిస్తూ అభివృద్ధే పరమావధిగా ప్రజాభిప్రాయాన్ని మన్నించాలి తప్ప, అధికార మదంతో కళ్ళు కనిపించకుండా, ధృతరాష్ట్రుడిలా సంతాన వ్యామోహంలో పడి అన్ని అనర్థాలకు కారకులు కాకూడదు. నిస్వార్థంతో నిజాయితీగా ఉండి నిండు మనసుతో ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే దేవుళ్ళని నమ్మినవాళ్లని భావితరాలు ఎప్పటికీ మర్చిపోవు. "యేన కే నాపి కార్యేణ సతాం హి లోక స్యారాధనం వ్రతం" అని భవభూతి ఉత్తర రామ చరిత్రలో రాముడి నోట పలికిస్తాడు. సత్పురుషులైన వారు ఏదైనా ఒక మంచి పని చేసి ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలని దాని అర్థం. నాటి రాచరికపు వ్యవస్థలోనే ప్రజాస్వామ్య విలువలని అంతగా గుర్తించాడు రాముడు. అందుకే అందరూ రామరాజ్యం కావాలని కోరుకుంటారు. రాముడు లాంటి ధర్మ స్వరూపుడైన పాలకుడు ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనైనా ఆదరింపబడతాడు. అందుకు కారణం వాల్మీకి చెప్పినట్లు రాముడు బుద్ధిమంతుడు, మృదుభాషి, పూర్వభాషి, మితభాషి, స్మితభాషి, ప్రసన్నవదనుడు, ప్రియంవదుడు, పరాక్రమశాలి, నిరహంకారి. నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి లక్షణాలున్న పాలకుడు లభిస్తే ప్రజలు ఎంత అదృష్టవంతులో కదా! అలాగే పాలకుడు అవసరమని భావించినప్పుడు ప్రజాప్రయోజనాల దృష్ట్యా కఠినుడుగా వ్యవహరించాలి. కవి చౌడప్ప తన నీతి శతకంలో "అధికారము మెత్తనైనా, అధికారి మెత్తనైనా ప్రజలు అసహ్యించుకుంటారు" అని చెబుతాడు. అలాగే పాలకుడు, చట్టాలు కఠినంగా వ్యవహరించకపోతే పాలన కట్టు తప్పి దేశంలో అరాచకం తాండవిస్తుందని హెచ్చరిస్తాడు చాణక్యుడు. కాబట్టి మంచి వ్యవస్థలో పాలకుడు ప్రధాన పాత్రధారి. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం భగవంతుడే పాలకుడి రూపంలో ఉంటాడు. ఇది ముమ్మాటికీ నిజం. తల్లి, తండ్రి, గురువుల శిక్షణతో చిన్నతనం నుంచే మంచి ఆలోచన విధానంతో ఎదిగిన మనిషి సమాజంలో ఒక భాగంగా మారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సమాజానికి అతీతంగా మనిషి బతకలేడు. సమాజంలో తానూ ఒక భాగస్వామి కాబట్టి ఎదుటివారి మనోభావాలను గౌరవిస్తూ ప్రాధాన్యతలను గుర్తించి ప్రేమ, శాంతి, కరుణ లాంటి సద్భావాలతో కూడిన ఒక హృదయంతో మనిషిని మనిషిగా గుర్తించాలి. కుల, మత, ప్రాంతాల కతీతంగా ఆప్యాయతానురాగాలను అందిస్తూ.. అందుకుంటూ సహజీవనం చేసిననాడు అంతకంటే సంతోషం, సౌఖ్యం మనిషికి మరొకటి ఉండదు. సంకుచిత భావాలతో ధిక్కార ధోరణి నవలంబించి సామాజిక స్థాయికి ఆర్థిక అసమానతలు, కుల, మత ప్రాంతాలను కొలమానంగా పరిగణించిన నాడు ఆత్మాభిమానం దెబ్బతిని ఎదుటి వర్గం ప్రజలు తిరుగుబాటు చేస్తారు. ప్రజలలో పరస్పర ప్రేమానురాగాలు, విశాల దృక్పథంతో పరిఢవిల్లిన నాడు శాంతి సామరస్యాలు సమాజంలో బలంగా నెలకొని కట్టు తప్పకుండా ఉంటాయి. విశేషమేమంటే సృష్టిలో ఏ జంతువూ కేవలం వినోదం కోసం సాటి జంతువును హింసించదు. ఆకలితో మాత్రమే ఆ పని చేస్తుంది. కడుపు నిండి కూడా మనిషి మాత్రమే ఎదుటి మనిషిని మానసికంగా, శారీరకంగా రకరకాల ఆలోచనలతో, అసమానతలతో హింసించి వినోదిస్తుంటాడు. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన ఈ ఆధునిక సమాజంలో కూడా కొందరు పాశవిక ప్రవృత్తి కలిగి, ఆటవిక న్యాయాన్ని అవలంబించి సమాజంలో అశాంతికి, అల్లర్లకు కారణమవుతున్నారు. సమాజం పట్ల సరైన అవగాహన కలిగి మానవత్వంతో ఎదుటి మనిషిని గౌరవించిన నాడు ఏ సమస్యా ఉత్పన్నం కాదు. ప్రజాస్వామ్యరథం గాడి తప్పుతున్న వేళ తిరిగి దాన్ని సరైన బాటలో నడిపించేలా ప్రజల్ని, ప్రభుత్వాధినేతల్ని, కార్యనిర్వాహక సంస్థల్ని జాగృతం చేసి, కార్యోన్ముఖుల్ని చేయడంలో ప్రసార సాధనాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. పార్టీలకతీతంగా, నిష్పాక్షికంగా అక్షరాలు పత్రికల్లో కీలకపాత్ర వహించేలా పత్రికాధిపతులు, సంపాదకులు వ్యవహరించాలి. అలాగే ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు, పాలకులకు కనువిప్పు కలిగేలా ఉండాలి తప్ప, తాత్కాలిక స్వప్రయోజనాల కోసం శాశ్వత విలువలకు తిలోదకాలు ఇచ్చి, సంకుచిత ధోరణితో రాజకీయ పార్టీల మైకంలో పడి ఉన్నట్లయితే, వాటి విశ్వసనీయత కోల్పోవడమే కాక ప్రజాస్వామ్యం కూడా ప్రమాదంలో చిక్కుకుంటుంది. చివరికి పాలనావ్యవస్థలో దేశంలో అరాచకశక్తులు పెరిగి సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలలో అస్తవ్యస్త పరిస్థితులు ఏర్పడి అందరికీ అనర్థకారకమవుతుంది. అన్ని రంగాల్లో విలువలు అన్న పదానికే తావు లేకుండా పోతుంది. కనుక దేశం, ప్రజల శ్రేయస్సు దృష్ట్యా విలువలతో కూడిన సమాజాన్ని చూడాలనుకునే పత్రికలు లేదా ప్రసార సాధనాలు నిజాయితీతో, నిబద్ధతతో వ్యవహరించి తమ బాధ్యతను గుర్తించి ప్రజాస్వామ్యాన్ని పది కాలాలపాటు కాపాడటానికి ప్రయత్నించాలి. ఇలాంటి శుభపరిణామం దేశంలో ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాలలో రావడానికి ఎంతో దూరంలో లేదని ఆశిద్దాం.

# వంకర బుద్ధులు మారవా



ఏదో వంకన కులమతాల కుంపట్లు రాజేసే పనికి పాల్పడవద్దని సర్వోన్నత న్యాయస్థానం చెప్పిన హితవు కూడా ప్రభుత్వాల చెవికెక్కడంలేదు. ఇందుకు ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వాల పోకడలు నిదర్శనం. కావడ్ యాత్ర సాగే పొడవునా ఆహారం, ఇతర తినుబండారాలు విక్రయించే వ్యాపారులు తమ పేర్లను తెలిపే బోర్డుల్ని ప్రదర్శించాలని ఉత్తరప్రదేశ్ పోలీసు విభాగం జారీ చేసిన హుకుంను మొన్న జూలైలో సుప్రీంకోర్టు నిలిపి వేయగా, దాన్ని వమ్ము చేస్తూ వేరే మార్గంలో అమలు చేయటానికి అక్కడి ప్రభుత్వం పూనుకోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. యూపీని చూసి మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్‌లు సైతం వాతలు పెట్టుకున్నాయి. అవి కూడా బీజేపీ ప్రభుత్వాలే. కానీ ఈ మాదిరి ధోరణులకు వ్యతిరేకమని చెప్పే కాంగ్రెస్ నేతృత్వంలోని హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం సైతం ఈ ప్రయత్నమే చేయటం మరింత దిగ్భ్రాంతిని కలిగిస్తుంది. ఒక మంత్రి తెలిసీ తెలియక ఏదో అన్నారని కాంగ్రెస్ సంజాయిషీ చెబుతున్నా ఆత్మవిమర్శ చేసుకోవటం ఆ పార్టీ బాధ్యత. ఎవరూ కుల మతాలను ఎంచుకుని పుట్టరు. కానీ పుట్టకనుబట్టి వివక్ష ప్రదర్శించే దురాచారం మన దేశంలో రాజ్యాంగం నిషేధించినా కొనసాగుతూనేవుంది. దహనకాండకు దిగే వ్యక్తులను దుస్తుల్ని బట్టి పోల్చుకోవచ్చని అయిదేళ్లక్రితం ప్రధాని నరేంద్ర మోదీ అన్నప్పుడు దుమారం రేగింది. అప్పటికి పౌరసత్వ సవరణ చట్టంపై కొనసాగుతున్న ఉద్యమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన ఆ వ్యాఖ్యలు చేశారు. దుస్తులే కాదు... ఇంటిపేర్లూ, పేర్లూ, పేర్లచివరవుండే తోకలు, తినే తిండి కూడా సమ స్యాత్మకం కావటం వర్తమానంలో ఎక్కువైంది. దీన్నంతటినీ గమనించబట్టే యూపీ పోలీసుల ఉత్తర్వులను సుప్రీంకోర్టు నిలిపివేసింది. ఇలాంటి ఉత్తర్వులిచ్చే అధికారం పోలీసు విభాగానికిఉండదని చెబుతూనే తోపుడు బండ్లు, ధాబాలు, హోటళ్ల యజమానులు స్వచ్ఛందంగా తమ పేర్లు ప్రదర్శించదల్చుకుంటే అభ్యంతరంలేదని, అయితే బలవంతంగా ఆ పని చేయించరాదని సుప్రీంకోర్టు అప్పట్లో తెలిపింది. ఇప్పుడు ఏకంగా ఆహార భద్రత, ప్రమాణాల చట్టం సవరణ మాటున యూపీ సర్కారు దాన్ని అమలుచేయడానికి పూనుకుంటున్నది. ఆహారంలో కల్తీ జరగకుండా, అపరిశుభ్రత లేకుండా చూడటం తన ఉద్దేశమంటున్నది. హిమాచల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి విక్రమాదిత్య సింగ్ సైతం ఆ బాణీనే వినిపిస్తున్నారు. రాష్ట్రంలో ఇటీవల మతఘర్షణలు చెలరేగటం వెనక ఆహారపదార్థాల విక్రయానికి సంబంధించి బలమైన చట్టం లేకపోవటమే కారణమని ఆయనకు అనిపించిందట! యూపీఏకు ఆవును చేరిస్తే అది ఎన్డీయే అవుతుందని చాన్నాళ్లక్రితం ఎవరో చమత్కరించారు. తమ చాపకిందకు నీళ్లు రాబోతున్నాయని చివరాఖరులో అర్థమయ్యాక హిందూ ఓటు బ్యాంకును కాపాడుకోవటానికి ఆనాటి యూపీఏ సర్కారు వేసిన అనేక పిల్లిమొగ్గలు చూశాకే అలాంటి వ్యాఖ్యా నాలు వినబడ్డాయి. ఆ మన స్తత్వం పార్టీలో ఇంకా సజీవంగా ఉండటంవల్లే విక్రమాదిత్యసింగ్ ఇలా అన్నారా లేక సీఎం రేసులో భంగపడి కేబినెట్ పదవితో సరిపెట్టుకోవటం జీర్ణించుకోలేక వివాదా స్పదంగా మాట్లాడారా అన్నది ఆ పార్టీ తేల్చుకోవాలి. ఆహార విక్రయ దుకాణాల దగ్గర యజ మానుల పేర్లుండాలన్న అంశంలో కమిటీ వేశామని, ఇంతకుమించి ముందుకుపోలేదని కాంగ్రెస్ ప్రతినిధి ఇస్తున్న వివరణ సందేహాలను తగ్గించకపోగా పెంచింది. పార్టీకంటూ ఒక సిద్ధాంతం, విధానం ఉందా లేదా? యూపీ నిర్ణయాన్ని నిర్ణయాన్ని పార్టీ వ్యతిరేకించినప్పుడు వేరే రాష్ట్రంలో ఆ పార్టీ ప్రభుత్వం సరిగ్గా అదే పనికి పూనుకోవటంలోని మతలబేమిటి? పేర్లు కాదు... వారి వారి గుర్తింపు కార్డులు ప్రదర్శించాలన్న ప్రతిపాదన వచ్చిందని మరో సంజాయిషీ. ఏమైతేనేం... మతంపేరిట విద్వేషాలు సృష్టించటమే అంతరార్థంగా కనబడుతోంది. దుకాణంలో విక్రయించే ఆహార పదార్థాలు పరిశుభ్రమైనవని, ప్రామాణికమైనవని విశ్వసిస్తేనే వాటిని జనం కొనుక్కుతింటారు. కానీ ఆ నమ్మకాన్ని వమ్ము చేయటమే మన దేశంలో కనిపిస్తుంది. ఈ విషయంలో అవసరమైన చట్టాలున్నాయి. ఆ నిబంధనలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకునే విభాగాలు ఉంటున్నాయి. కానీ వాటిని పకడ్బందీగా అమలు చేయటానికి సిద్ధపడని ప్రభుత్వాలు ఆ వంకన విభజన రాజకీయాలకు తెరతీస్తున్నాయి. ప్రత్యర్థులను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అలవికాని హామీలిచ్చి అధికారంలోకొచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అందరూ ఎంతో భక్తివిశ్వాసాలతో స్వీకరించే లడ్డూపై ఎలాంటి దుష్ప్రచారం చేసిందో దేశమంతా చూస్తూనే వుంది. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ తెలివితక్కువ చర్యను స్ఫూర్తిగా తీసుకున్నట్టు కనబడుతోంది. మనుషుల పేర్లనుబట్టి, వారి ఆహారపుటలవాట్లనుబట్టి వారి మతాలను తెలుసుకోవటం సులభ మవుతుందన్నది వాస్తవమే కావొచ్చు. కానీ వారు విక్రయించే పదార్థాలు సమస్తం కేవలం ఆ కారణంతో మంచివి, ప్రామాణికమైనవి లేదా అపరిశుభ్రమైనవి ఎలా అవుతాయో అనూహ్యం. విపరీత పోకడలున్నవారికి తప్ప ఇటువంటి ఆలోచనలు రావు. సొంతంగా ఎటూ ఉన్నతమైన ఆలోచనలు రావు. కనీసం రాజ్యాంగాన్ని అనుసరించి మాత్రమే పాలించాల్సినవారు సర్వోన్నత న్యాయస్థానం హితవు చెప్పాకైనా మారాలికదా! వ్యక్తులుగా వక్రమార్గాలు వెదుక్కోవటం మానవ స్వభావమని సరిపెట్టుకోవచ్చు. రాజ్యం అటువంటి పనులకు పూనుకుంటే అంతిమంగా అరాచకానికి దారితీస్తుంది. కనుక మతిమాలిన చేష్టలను ఇకనైనా మానుకోవాలి.